## క్లుప్తంగా

### నాణ్యమైన భోజనం పెట్టాలి



పిల్లలతో కలసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

**వెదురుకుప్పం:** పిల్లలకు నాణ్యమైన భోజనం తయారు చేసి పెట్టాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శనివారం వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట చేసే సిబ్బంది భోజనాలను పరిశుభ్రంగా వండి పిల్లలకు అందించాలన్నారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. అంతకు ముందు పచ్చికాపల్లంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉంచిన సరుకులు, స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడి పౌష్టికాహారం సక్రమంగా పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 దామోదరం, కార్యదర్శి వెంకటేశ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సహాయకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

### చెంగయ్య కుటుంబానికి పరామర్శ



చెంగయ్యకు నివాళులర్పిస్తున్న కోలార్ ప్రకాష్, నాయకులు

**వెదురుకుప్పం:** మండలంలోని మాంబేడు గ్రామంలో మృతి చెందిన చెంగయ్య కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ చెంగయ్య పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పచ్చికాపల్లంలో ఉన్న శ్రీలక్ష్మీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు ప్రసాద్ కూడా చెంగయ్యకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

### నేడు ఆడి జాతర

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలోని మేస్త్రీ వీధిలో ఉన్న పడవేట్టు యల్లమ్మ ఆలయంలో ఆదివారం ఆడిజాతర మహోత్సవం జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అమ్మవారిని కొలువుదీర్చి విశేష పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం కలశాల ఊరేగింపు ఉంటుందన్నారు. అలాగే మొలకట చెట్లు, అగ్గికుండ, గంజి కుండ, గెరిగ ఊరేగింపు జరుగుతుందన్నారు. సాయంత్రం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.

### పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



దండువారిపల్లెలో అవగాహన కార్యక్రమం

**బంగారుపాళెం:** బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ వినుతశ్రీ అన్నారు. శనివారం మండలంలోని దుండువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని అన్నారు. పోషక పదార్థాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డకు ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఎంఎల్‌హెచ్‌పీ దేవిశ్రీ, ఏఎన్‌ఎం నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

### దుర్గమ్మ హుండీ ఆదాయం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ దేవస్థాన హుండీని శనివారం లెక్కించారు. హుండీ లెక్కించగా రూ.3,28,688 భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్నారు. వీటి లెక్కలు పక్కాగా ఉంటాయని, ఇందులో ఎలాంటి పొరపాటు జరగదని ఆలయ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వేడుకగా నాగాలమ్మ జాతర

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరం ఆటోనగర్‌లో వెలసిన నాగాలమ్మ ఆలయం వద్ద శనివారం నాగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను వీధిలో కొలువుదీర్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని కర్పూర హారతులతో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# సపోటా సాగు.. లాభాలు బాగు

నియోజకవర్గంలో దాదాపు 480 హెక్టార్లలో రైతులు సపోటా సాగు చేస్తున్నారు. ఈ పంటను ఆశించే తెగుళ్లు, చీడపీడలు తక్కువ. మెట్ట ప్రాంత రైతులు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని పాలసముద్రం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. సపోటా సాగు యాజమాన్య పద్ధతులు, మెళకువలను ఆయన ఇలా వివరించారు. – కార్వేటినగరం





**వాతావరణం**

సపోటా సాధారణంగా వేడిమి వాతావరణం కలిగిన ప్రాంతాల్లో అధికంగా పండుతుంది. జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాలకు ఈ పంట అనువైనది. నీటి ఎద్దడిని తట్టుకునే వర్షాధార పంట కావడంతో గాలిలో తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో సపోటా అధికంగా పండుతుంది.

**అనువైన నేలలు**

నీరు ఇంకే అన్ని రకాల నేలలు అనుకూలమైనవే. తేలిక నేలల్లో త్వరగా ఎదుగుతుంది. కాపు బాగుంటుంది. ఇసుక, అధిక చౌడు, ఉప్పు నేలలు కూడా అనువైనవే. నీటి ఎద్దడిని తట్టుకేనే స్వభావం ఉండడంతో కొండ ప్రాంతాలు, లోతు తక్కువ నేలల్లో సాగు చేయవచ్చు.

**రకాలు**

పాల రకం చిత్తూరు జిల్లాలో అత్యధికంగా సాగులో ఉంది. ఈ రకం ఎక్కువ దిగుబడి ఇవ్వడమే కాకుండా పంట నిలువ చేసుకోడానికి. ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా ఉంది.


- పీకే ఎం-1రకం అధిక సాంద్రతలో నాటడానికి అనువుగా ఉంటుంది. దిగుబడి అధికంగా వస్తుంది.
- పీకేఎం-2 రకం సపోటా చెట్టు నిలువుగా పెరగడంతో కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. అంటు కట్టే పద్ధతి ద్వారా మొక్కలను ఎంపిక చేసుకోవచ్చు.

**సపోటా నాటే పద్ధతులు**

- ఆగస్టు నుండి మార్చి వరకు నాటడానికి అనుకూలం. ఎంపిక చేసిన రకాన్ని బట్టి ఎటుచూసినా 10 ఇంటూ 10 మీటర్ల దూరం ఉండే విధంగా చూసుకోవాలి. ఇలా చేస్తే ఎకరాకు 40 మొక్కలు నాటుకోవచ్చు. 5 ఇంటూ 5 మీటర్ల దూరంలో అయితే 80 మొక్కలు నాటుకోవచ్చు. 1ఇంటూ 1ఇంటూ 1 మీటర్ల లోతుల్లో గుంతలు తవ్వి వాటి మట్టిలో 30 కిలోల పశువు ఎరువు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 200 గ్రాములు 2 శాతం పెరిథియోన్ పొడితో 10 నుంచి 15 కిలోల కొబ్బరి పొట్టు కలిపి మొక్కను నాటుకోవాలి. కొబ్బరి పొట్టు కలిపి మొక్కను నాటడంతో వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకోగలుగుతుంది. మొక్క నాటే ముందు గోతిలో వేసిన మిశ్రమం కుళ్లి సేంద్రియ ఎరువుగా మారి మొక్కకు ఉపకరిస్తుంది. మొక్క ఒరిగిపోకుండా కర్రలను పాతుకోవాలి. వేరు మూలం నుంచి పెరిగే మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి.

**సస్యరక్షణ చర్యలు**

మొగ్గ తొలిచే పురుగు గులాబీ రంగులో ఉండి జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో పంటను ఆశిస్తుంది. ఆకుగూడు అల్లే పురుగు కూడా జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ఆశిస్తుంది. ఈ పురుగు ఆకులను గూళ్లుగా మార్చి తినడం, లేక చిగురుకు హాని చేస్తుంది. పిండి నల్లి పురుగు తెల్లటి పిండి పదార్థంతో కప్పి ఉంటుంది. ఇది పూలకొమ్మలు, కాయతొడిమలను ఆశించి రసం పీల్చడంతో పిందె రాలడం, కాయ ఎదగకపోవడం తదితర ఇబ్బందులు వస్తాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించని తోటల్లో కాయ తొలిచే పురుగు ఏర్పడుతుంది. పై తెగుళ్లను అరికట్టడానికి పిందె గోలీకాయ సైజులో ఉన్నప్పుడు క్లోరోపైరిఫాస్ లేదా కార్బరిల్ మూడు గ్రాములు కలిపి ఆకుల చిగుళ్లు, కొమ్మలు తడిపే విధంగా పిచికారీ చేయాలి.



సాగులో ఉన్న చెట్టులో సపోటా కాయ

**కలుపు నివారణ చర్యలు**

మొక్కల మధ్యలో ఖాళీగా ఉన్న నేలలో పచ్చిరొట్ట పైర్లు వేసి కలియదున్నడంతో కలుపు నివారించవచ్చు. లేకుంటే కాపునకు వచ్చిన చేలల్లో అంతర పంటలుగా వేరుశనగ, కూరగాయలు సాగు చేయవచ్చు. గడ్డి జాతి కలుపు మొక్కల నివారణ కోసం గ్లైఫోసెట్ మందును లీటరు నీటికి 5-8 మిల్లీ లీటర్ల కలుపుకుని పిచికారీ చేయాలి.

**వాడాల్సిన ఎరువులు**

- మొక్క వయసును బట్టి ఎరువుల మోతాదు వేయాలి.
- 1-3 సంవత్సరాల మొక్కలకు నత్రజని 50 గ్రాములు, యూరియా 110 గ్రాములు, భాస్వరం 20 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 125 గ్రాములు, పొటాష్ 75 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 125 గ్రాములు, చివికిన పశువుల ఎరువు 25 కిలోలు చొప్పున వేయాలి.
- 4-5 సంవత్సరాల మొక్కలకు 4-5 సంవత్సరాల వయసు మొక్కలకు నత్రజని 110 గ్రామలు, యూరియా 220 గ్రాములు, భాస్వరం 40 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 250 గ్రాములు, పొటాష్ 150 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 250 గ్రాములు, చివికిన పశువుల ఎరువు 50 కిలోలు వేయాలి.
- 5-8 సంవత్సరాల మొక్కలకు 5-8 సంవత్సరాల వయసు మొక్కలకు నత్రజని 200 గ్రాములు, యూరియా 440 గ్రాములు, భాస్వరం 80 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 500 గ్రాములు, పొటాష్ 300 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 500 గ్రాములు, చివికిన పశువుల ఎరువు 50 కిలోలు చొప్పున చేయాలి.
- 8 సంవత్సరాల పైబడిన మొక్కలకు నత్రజని 400 గ్రాములు, యూరియా 880 గ్రాములు, భాస్వరం 160 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 1 కిలో గ్రాము, పొటాష్ 300 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 750 గ్రాములు, చివికిన పశువుల ఎరువు 50 కిలోలు చొప్పున వేయాలి.

### వసతి గృహాలను వినియోగించుకోండి

**గంగాధరనెల్లూరు:** సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమాధికారి షకీలా ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధరనెల్లూరు, తూగుండ్రం, కొత్తపల్లి మిట్ట ఉగ్రాణంపల్లి వసతి గృహాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు చేరుటకు అవకాశం ఉందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమాధికారి కోరారు. ఈ సంక్షేమ గృహాలలో ప్రతిరోజు విద్యార్థులకు స్టడీ అవర్స్‌తో పాటు యోగా చేయిస్తామని తెలిపారు. వసతి గృహాలు చేరిన విద్యార్థులకు కొత్త దుప్పట్లు, కార్పెట్లు, ట్రంక్ బాక్సులు, స్టేషనరీ తదితర సౌకర్యాలు కల్పిస్తామని, ప్రతి రెండో శనివారం డాక్టర్లతో ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయిస్తామన్నారు. పదో తరగతి విద్యార్థులకు ట్యూషన్‌లో ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇవ్వబడునని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం సన్న బియ్యంతోపాటు పౌష్టికాహారం అందించబడునని తెలిపారు. ప్రతి నెలా రెండో శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి పిల్లల అభివృద్ధికి పాటుపడుతామన్నారు.

### 5వ తేదీ నుంచి మాతమ్మ కొలుపు

**వెదురుకుప్పం:** మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ జడబాపనపల్లె ఆదిఆంధ్ర వాడలో 5న మంగళవారం నుంచి మాతమ్మ ఆలయంలో కొలుపు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5 నుంచి 11 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. మంగళవారం కాపుకట్టుట, బుధవారం పుట్ట పూజ. గురువారం అమ్మవారి కల్యాణం, శుక్రవారం తపస్మాన్ కార్యక్రమం, వనం కొరుకుడు, శనివారం గౌరమ్మ మేడ, ఆదివారం అమ్మవారి అగ్ని గుండ ప్రవేశం, అమ్మవారి ఊరేగింపు, సోమవారం బలి తిరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేసినట్లు పేర్కొన్నారు.

## వ్యాఘ్రంపై ద్రౌపదీదేవి విహారం

**పుత్తూరు:** శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పులి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటా నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణ పాండవ, కౌరవ జననం ఘట్టాన్ని నిర్వహించారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి సుమతి హరికథా గానం నిర్వహించారు. రాత్రి 8గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జున స్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు గాండ్ల సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



గెరిగ ఊరేగింపు

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

ఆదివారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు. మధ్యాహ్నం 3 గంటలకు పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం. రాత్రి 8 గంటలకు యాళి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించునున్నారు.

### పుత్తూరులో మరో చోరీ



చోరీ జరిగిన పిజ్జా రెస్టారెంట్

**పుత్తూరు:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి వరుస దొంగతనాలు జరిగిన విషయం మరవక ముందే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనే పిజ్జా క్యాపిటల్ రెస్టారెంట్ గదిలో మరో దొంగతనం శనివారం ఉదయం చోటు చేసుకొంది. బాధితుడు లోకేష్ కథనం మేరకు.. రెస్టారెంట్‌కు ఆనుకొని ఉన్న వర్కర్స్ రూమ్‌లోకి దుండగుడు ప్రవేశించి రూ.30 వేలు విలువ చేసే రెండు సెల్ ఫోన్లు, రూ.20 వేలు నగదు దోచుకెళ్లాడు. సీసీ పుటేజీలను పరిశీలించిన నేపథ్యంలో శనివారం ఉదయం 6.40 గంటల సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు కొనసాగుతోంది.

## గ్రావెల్ అక్రమ తరలింపుపై కఠిన చర్యలు



క్వారీని పరిశీలిస్తున్న ఏడీ సుబ్రమణ్యం, తహశీల్దార్ అరుణకుమారి

**పాలసముద్రం(కార్వేటినగరం):** మండలంలో ఎర్రమట్టి గ్రావెల్‌ను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తే చర్యలు తప్పవని మైన్స్, విజిలెన్స్ ఆఫీసర్ (ఏడీ) సుబ్రమణ్యం తెలిపారు. శనివారం వనదుర్గాపురం పంచాయతీ తమిళనాడు సరిహద్దులోని ఎర్రమట్టి గ్రావెల్ క్వారీని తహసీల్దార్ అరుణకుమారితో కలసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తమిళనాడుకి తరలించరాదని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, పోలీస్ యంత్రాంగం గ్రావెల్ తరలించకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. అలా తరలిస్తున్న వాహనాన్ని పరిశీలించి రికార్డులు సక్రమంగా లేని వాహనాన్ని సీజ్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప, వీఆర్‌ఓ తంగరాజ్, వెంకటాచలం ఉన్నారు.

### సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

**గుడిపాల:** తల్లిపాలతోనే పిల్లల సంరక్షణ ఎదుగుదలకు శ్రేష్టమైందని ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి, సర్పంచ్ పెరిల్లా అన్నారు. సోమవారం కిల్లారిపల్లె, 189 కొత్తపల్లె, అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు పుట్టిన గంటలోపు తల్లి పాలను తప్పనిసరిగా పట్టించాలన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఒకసారి రక్తహీనతకు గురైతే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని, తద్వారా వ్యాధులు త్వరగా వస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, ఇందిర, నిర్మల, గౌరి పాల్గొన్నారు.



గుడిపాల: తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

## తల్లి పాలు బిడ్డకు సంజీవిని



మాట్లాడుతున్న డాక్టర్ కీర్తిప్రియ



జీడీ నెల్లూరులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

**నగరి:** తల్లి పాలు బిడ్డకు సంజీవిని అని డాక్టర్ కీర్తిప్రియ అన్నారు. శనివారం సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. ముర్రు పాలు బిడ్డకు మొదటి సహజ టీకా అన్నారు. అందులో ఉండే ప్రొటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వ్యవస్థ బలపడేందుకు తోడ్పడుతాయన్నారు. అలాగే వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయన్నారు. బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీలు, ఎంఎస్‌కేలు, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం**

**గంగాధరనెల్లూరు:** మండలంలోని గంగాధరనెల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈనెల ఒకటవ తేదీ నుండి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగడంతో వ్యాధి నిరోధక శక్తి రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని ఆమె తెలిపారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సంగీత, ఏఎన్‌ఎం మమత, ఆశ వర్కర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ వాణి పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

**చిత్తూరు అర్బన్:** మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.30 వేలు జరిమానా విధిస్తూ చిత్తూరులోని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజశ్రీ మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.30 వేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన 17 మందికి రూ.1000 చొప్పున విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.



## అమ్మేశారు.. చేతులు దులిపేసుకున్నారు

- రిజిస్ట్రేషన్‌లోనూతలెత్తని సమస్యలు
- నేడు ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలంటున్న మున్సిపల్ అధికారులు
- ప్లాట్లు కొన్నవారిపై క్రమబద్ధీకరణ గుదిబండ

**నగరి:** మున్సిపల్ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గతంలో రియల్టర్లు ప్లాట్లు వేసేశారు. స్వంత ఇంటి స్థలం ఎప్పటికైనా కొనుగోలు చేసుకోవాలనుకున్న మధ్య తరగతి కుటుంబాల వారు తాము ఏళ్ల తరబడి పోగు చేసుకున్న సొమ్ముతో వారికి సమీపంగా అనువుగా ఉండే ప్రాంతాల్లో ప్లాట్లు కొనేశారు. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగిపోయాయి. సొంత ఇల్లు నిర్మాణానికి తంటాలు పడుతూ డబ్బులు పోగు చేసుకుంటున్నారు. ఈ దశలో నివాసం ఉన్నవారిలో కొనుగోలు చేసిన ప్లాట్లు ఉన్న లేఅవుట్లు మున్సిపల్ నిబంధనల ప్రకారం వేయలేదని, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వేశారని అలాంటి ప్లాట్లు రెగ్యులరైజ్ చేసుకోవాలని (క్రమబద్ధీకరించుకోవాలని) మున్సిపల్ అధికారులు ప్రకటనలు ఇచ్చారు. కొత్తగా సవరించిన జీఓఎంఎస్ నెంబరు 134 ఉత్తర్వుల మేరకు 2025 జూన్ 30 లోపు అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు అక్టోబర్ 24 లోపు రెగ్యులరైజ్ చేసుకోవాలంటూ గడువు విధించారు. దీంతో అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలా నగరి మున్సిపల్ పరిధిలో అనధికారికంగా వేసిన లేఅవుట్లు 37 ఉన్నాయి. సుమారు 85 ఎకరాల విస్తీర్ణం లేఅవుట్లకు వాడబడి ఉంది. ఈ లేఅవుట్లలో ఎప్పుడో ప్లాట్లు కొని ఇల్లు కట్టుకునేందు ఎన్నో కష్టాలు పడి పోగు చేసుకుంటూ ఉంటే ఇంకా ప్లాట్లపై ఖర్చులు చేసి దానిని క్రమబద్ధీకరించుకోవడమేంటని ఆవేదనకు లోనవుతున్నారు. అయినా అనధికారిక ప్లాట్లు అని అవి వేసినపుడే అధికారులకు తెలుసునని, వాటిని ఎలా అనుమతించారని ప్రశ్నిస్తున్నారు. వాటిని ఎలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టరు చేశారని ప్రశ్నిస్తున్నారు. ఎలాగోలా లేఅవుట్లు వేసి వాటి అమ్మకాలు జరిపించేసిన రియల్టర్లు చేతులు దులిపేసుకుని వెళ్లిపోయారని భారం మా మీద పడుతోందని అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఆదాయం సృష్టించడమంటే ఇదేనా అంటూ నోరెళ్లబెడుతున్నారు.




మున్సిపల్ కార్యాలయం

**రెగ్యులరైజ్ చేసుకోవాలంటే...**

- రిజిస్ట్రేషన్ వాల్యూలో 50 శాతం గానీ రూ.10 వేలు గానీ అడ్వాన్సుగా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- సైట్ ప్లాన్, లేఅవుట్ స్కెచ్‌తో రిజిస్టర్ డాక్యుమెంట్లు
- ఈసీ, ఇండిమినిటీ బాండ్లు, ఆధార్‌కార్డుతో మున్సిపల్ అధికారులను సంప్రదించి ఎల్‌ఆర్‌ఎస్ లాగిన్‌కు వెళ్లి అప్‌లోడ్ చెయ్యాలి.

**క్రమబద్ధీకరించుకుంటేనే ప్రయోజనాలు**



రెగ్యులరైజ్ చేసుకుంటే భవన నిర్మాణ అనుమతులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సులభంగా చేసుకోవచ్చు. 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు, బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అక్టోబరు 24 వరకు మాత్రమే ఈ అవకాశం. క్రమబద్ధీకరించుకుంటే సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైన్, వీధి దీపాలు లాంటి మౌలిక వసతులు ఉండవు. –కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ